# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 147 ప్రకాశం, గురువారం 26- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కదిరి




**సి ఎస్ పురం/పామూరు, ఫిబ్రవరి 25, క్రైం కౌంటర్** చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కదిరి బాబురావు అన్నారు. బుధవారం శీలంవారిపల్లి గ్రామం లోని ఆయన కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ప్రతి మహిళకూ నీకు 18000 వేలు, నీకు 18000 వేలు, నీకు 15000 వేలు,అని చెప్పి ఇప్పుడు ప్రజల్లో ధైర్యంగా తిరగలేక ముఖం చాటెస్ట్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను మోసం చేస్తుంది, రైతులకు యూరియా ఇవ్వలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారని జగన్ మెహన్ రెడ్డి గారు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పుష్కళంగా ఎరువులు, విత్తనాలు అందించారు పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి గారి పరిపాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు గడప వద్దకే చేర్చామని గ్రామాల్లో ప్రజలు మాకు ఒక పెన్షన్ తప్ప మరే పథకం రావటం లేదని మా వద్దకు వచ్చి విలపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు చేసిన అభివృద్ధి 24 గంటలూ మద్యం అందు బాటులో ఉండడం, డోర్ డెలివరీ చేయడం తప్ప మరే హామీ నెరవేర్చలేదని తెలిపారు.

కుటమి పాలనలో పథకాలు అందక నిరుపేదలు అలమటిస్తున్నారు.జగన్ మోహన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని ఎందుకు గెలిపించుకోలేక పోయమా అని ఈ రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారు.కూటమి ప్రభుత్వం లో నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో దమ్ముంటే గ్రామ, వార్డు సచివాలయాలలో జాబితా ప్రచురించాలని డిమాండ్ చెశారు. జగన్ మోహన్ రెడ్డి గారు 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి పేద విద్యార్థులను డాక్టర్లను చెయ్యాలని చుస్తే, వాటిని ప్రవేట్ పరం చేసి లబ్ది పొందాలని చూసిన దుర్మార్గుడు చంద్రబాబు అని అన్నారు.మత పరమ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డును కూడా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, తమ స్వార్ధ రాజకీయాల కోసం వాడుకున్నారు.వచ్చే ఎన్నికల్లో తిరిగి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం ఖాయం, జగన్ మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అవ్వడం తథ్యం .ఈ కార్యక్రమం లో ఇరగని చలపతి రావు, మాజీ ఎంపీటీసీ లు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, సర్పంచ్ షేక్ బుజ్జి, మస్తాన్ రెడ్డి, నున్నా నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన.మాజీ ఎమ్మెల్యే కదిరి





**కనిగిరి/పామూరు, ఫిబ్రవరి 25, క్రైం కౌంటర్** కనిగిరి పట్టణానికి చెందిన భైరపు కృష్ణ ల కుమార్తె సుప్రజ, హేమంత్ కుమార్ ల వివాహ వేడుక బుధవారం కనిగిరి లోని ఏటీఆర్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ సభ్యులు మడతల కస్తూరి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి,పట్టణ అధ్యక్షులు సిరుప గోవర్ధన్ రెడ్డి ,కదిరి రమణయ్య,కోవిలంపాడు సర్పంచ్ షేక్ బుజ్జి,సర్పంచ్ రవీందర్ రెడ్డి ,బొట్టు శ్రీను,సూరసాని మోహన్ రెడ్డి,కటికల వెంకట రత్నం,సూరసాని నరసారెడ్డి ,మడతల వెంకటేశ్వర రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో సీఎంను కలిసిన యాదాల సాయి

## సాయిని ఆత్మీయంగా పలకరించిన సీఎం చంద్రబాబు


**పామూరు, ఫిబ్రవరి 25, క్రైం కౌంటర్**

పామూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ యాదాల సాయి కిరణ్ తన అనుచరులతో టిడిపి ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లె గ్రామంలో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనుల శంకుస్థాపన కోసం మార్కాపురం కు విచ్చేసిన ముఖ్యమంత్రిని కలిసేందుకు యాదాల సాయి తను అనుచరులతో కలిసి మార్కాపురం సభాస్థలి వద్దకు ఉగ్రతతో కలిసి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే య దాల సాయి గురించి పలు విషయాలు వివరించారు సాయి తండ్రి మాజీ ఎంపీపీ వైవి శేషారావు తల్లి అనురాధ మేజర్ పంచాయతీ సర్పంచ్ గా పనిచేశారని ప్రస్తుతం యాద ల సాయి ఉపసర్పంచ్ గా ఉన్నారని పరిచయం చేశారు. ఎన్నికల్లోఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రికి యాదా ల సాయి కృతజ్ఞతలు తెలిపారు టిడిపి పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సాయితోపాటు పలువురు వైసీపీని వీడారని ఉగ్ర తెలిపారు అందుకు స్పందించిన సీఎం పామూరులో టిడిపి బలోపేతానికి ఉగ్రత కలిసి పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా సాధించేలా కృషి చేయాలని సూచించినట్లు సాయి తెలిపారు చంద్రబాబు ను కలిసిన వారిలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చల్లా సుబ్బారావు పంచాయతీ వార్డు మెంబర్లు పోకూరి బాల షేక్ జిలాని భాష షేక్ నాయబ్ రసూల్ రమణయ్య



రాగిపాటి సుధాకర్లు ఉన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన.మాజీ ఎమ్మెల్యే కదిరి






**కనిగిరి/పామూరు, ఫిబ్రవరి 25, క్రైం కౌంటర్** కనిగిరి పట్టణానికి చెందిన ప్రగతి విద్యాలయం అధినేత కొప్పోలు ప్రభాకర్ గారి కుమారుడు సందీప్, సుష్మ ల వివాహ వేడుక బుధవారం కనిగిరి లోని పవిత్ర ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమం లో మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైయం ప్రసాద్ రెడ్డి, కదిరి రమణయ్య,మాజీ ఎంపీటీసీ షేక్ జిలాని, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఐ వి నారాయణ, కోవిలంపాడు సర్పంచ్ షేక్ బుజ్జి,తదితరులు పాల్గొన్నారు.

# సంపత్ సూర్యకు లాప్ టాప్ బహూకరణ:

- . ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తాం
- , శ్రీగిరి దేవస్థానం నిర్వాహకుల వెల్లడి



**ఒంగోలు క్రైశీకౌంటర్ ప్రతినిధి,** నగరం లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఆదూరి ప్రద్యుమ్న కుమార్ (బుజ్జి స్వామి ) ...లక్ష్మి దంపతుల కుమారుడు

రైజ్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆదూరి సంపత్ సూర్యకు లాప్ టాప్ అత్యవసరం కావడంతో ఆ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులు శ్రీగిరి ధర్మకర్తల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి లాప్ టాప్ ను బుధవారం సంపత్ సూర్యకు అంద చేశారు. తమ కుమారుని చదువుకు ఆటంకం కలగకుండా లాప్ టాప్ ను అందించిన శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులకు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, . ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి చదువు నిర్విఘ్నంగా సాగేలా చూడడంతో పాటు విద్యా వైద్య సామాజిక ఆధ్యాత్మిక ధార్మిక సేవా రంగాల అభ్యున్నతికి తోడ్పాటును అందించడం తమ లక్ష్యమని వెల్లడించారు. శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు స్ఫూర్తితో తాము కూడా సేవా మార్గంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి చదువుకు అవసరమైన ఫీజులను చెల్లించడంతోపాటు లాప్ టాప్ లను కూడా అందజేయడం జరిగిందని పలు పాఠశాలలకు కూడా లాప్ టాప్ లను అందించినట్లు పేర్కొన్నారు. మానవసేవే మాధవ సేవ అని గుర్తు చేశారు.

## ఏపీ అసెంబ్లీ క్రీడోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



క్రైం కౌంటర్ ప్రతినిధి టి. నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈరోజు నుంచి ప్రారంభమైన 'ఏపీ అసెంబ్లీ క్రీడా మహోత్సవాల'లో ఉత్సాహంగా పాల్గొన్నారు నా సహచర ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలతో కలిసి ఇక్కడ అందరం ఒకే కుటుంబంలా ఆడుకోవడం ఒక మంచి అనుభూతిని ఇస్తోందన్నారు.రాజకీయాలలో ఎలాగూ నిరంతర పోరాటం ఉంటుంది, కానీ ఇక్కడ మేము ప్రజాప్రతినిధులం అన్న విషయం మరిచి.. కేవలం క్రీడాకారుల్లా పోటీపడుతున్నమని చెప్పారు

## సీఎం చంద్రబాబు



ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా, యర్రగొండపాలెం నియోజకవర్గంలో రూ.456 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు దోర్నాల మండలం లోని గంటవానిపల్లిలో శంకుస్థాపన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

## పలాసలో నిర్మించేది ఎయిర్‌పోర్టే



క్రైం కౌంటర్ న్యూస్ : పలాస, ఫిబ్రవరి 25 పలాస నియోజ కవర్గంలో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు చర్యలు వేగవం తం అవుతున్నాయని, ఇక్కడ నిర్మించేది కార్గో ఎయిర్ పోర్టు కాదని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలో ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డీ ప్రవీణ్‌ఆదిత్యను కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ పలాసలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నారనే అపో హలు వ్యాప్తి చెందుతున్నాయని, ఇది ప్రజలు ప్రయా ణించేందుకు వీలుండే ఎయిర్‌పోర్టు అని స్పష్టం చేశారు. దేశంలో రైలు ప్రయాణ రద్దీని తగ్గిస్తూ అదే సమయంలో సామాన్య ప్రజలకు అందుబాటులో విమానయానం ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉడాన్ పథకంలో భా గంగా వయాబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధా నంలో రెండేళ్లపాటు నేరుగా కేంద్ర ప్రభుత్వమే నిర్వ హణ బాధ్యతలు చేపడుతుందన్నారు. పలాస నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సెకండ్ ఏసీ రైలు ప్రయాణి కుల వివరాలు ఇప్పటికే కేంద్రం సేకరించిందన్నారు. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశంలో ప్రధాన నగరాలైన చెన్నై, బెంగుళూరు, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాలకు విమానాలు నడిపే అవకాశం ఉ oటుందన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూములు కోల్పోయే వారికి ప్రభుత్వం పరిహారం అందిస్తుంద న్నారు. తొందరలోనే ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారుల బృందం నిర్మాణ ప్రాంతంలో సర్వే చేస్తుందని, ఆ ప్రాంతంలో ఉండే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. పదో తరగతి చదివిన నిరుద్యోగులకు కూడా ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని, దీనికి సంబంధించిన వివరాలు తొందరలోనే పూర్తి స్థాయిలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూమికి ఎసరు

**10.62 ఎకరాలు...విలువ రూ.300 కోట్లు**
**నాలుగు దశాబ్దాల కిందట డీపట్టాలు**
**ఇరవై ఏళ్ల కిందట అమ్ముకున్న పట్టాదారుల వారసులు**
**డీపట్టా భూముల విక్రయం నిబంధనలకు విరుద్ధం**
**ఆ మేరకు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ**
**హెచ్చరిక బోర్డులు పెట్టిన రెవెన్యూశాఖ**
**ప్రస్తుతం 22ఏ జాబితాలో ఉన్న భూమి**
**వారం రోజులుగా చదును చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు**



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 25 విశాఖపట్నం/ఆనందపురం, ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలో 10.62 ఎకరాల ప్రభుత్వ భూమి (22 ఏ జాబితాలో కూడా ఉంది)ని కొందరు చదును చేస్తున్నారు. నాలుగైదు దశాబ్దాల క్రితం డీపట్టాలు పొందిన రైతుల వారసుల నుంచి తాము భూమి కొనుగోలు చేశామని చెప్పుకుంటున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.300 కోట్ల ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.
బొడ్డపాలెం సర్వే నంబరు 292లో నాలుగైదు దశాబ్దాల క్రితం దారసి అప్పారావురెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు 10.62 ఎకరాలకు డీపట్టాలు ఇచ్చారు. అయితే ఆ భూములను దాసరి అప్పారావు వారసులు 2004 తరువాత 2.62 ఎకరాలు, నాలుగు ఎకరాలు, నాలుగు ఎకరాలు వంతున ముగ్గురికి విక్రయించి రిజిస్టర్ చేశారు. అయితే డీపట్టా భూముల క్రయవిక్రయాలు చెల్లవు. డీపట్టా పొందిన వ్యక్తులు లేదా వారి వారసులు వ్యవసాయం లేదా తోటలు పెంచుకుని జీవనం సాగించాల్సి ఉంటుంది. డీపట్టా భూములు చేతులు మారాయనే విషయం తెలియడంతో 2007లో అప్పటి ఆనందపురం తహశీల్దారుకు మొత్తం 10.62 ఎకరాలు ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. దీనిపై భూమి కొనుగోలు చేసిన వ్యక్తి ఒకరు కోర్టులో కేసు వేశారు. ఆ తరువాత 2014, 2021లో భూమిలో ప్రవేశించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో 10.62 ఎకరాలను నిషేధిత భూముల జాబితా 22(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఈ భూములు 22(ఎ)లోనే ఉన్నాయి. అయితే భూములు కొనుగోలు చేసిన వారిలో ఒకరు వారం క్రితం ప్రొక్లెయినర్లతో రాళ్ల గుట్టలను తవ్వి బయటకు తరలిస్తున్నారు. భూమిని చదును చేస్తున్నారు. రాళ్ల గుట్టలను తవ్వి బయటకు తరలించేందుకు గనుల శాఖ, గ్రామ పంచాయతీ అనుమతి లేదు. ప్రస్తుతం 22(ఎ)లో ఉ oడడంతో అనుమతులు ఇచ్చే అవకాశం లేదు. ప్రభుత్వ భూమిని చదునుచేస్తున్న విషయం తెలుసుకున్న ఆనందపురం మండల తహశీల్దార్ శీనుబాబు వెంటనే సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. ఈ విషయమై తహశీల్దార్ మాట్లాడుతూ సర్వేనంబరు 292లో ఉన్న 10.62 ఎకరాలు ప్రభుత్వ భూమి అని స్పష్టంచేశారు. దీనిపై కొందరు కోర్టులో వేసిన కేసులు విచారణలో ఉన్నాయన్నారు. డీపట్టా భూములు అనుమతులు తీసుకోకుండా విక్రయించరాదని, గతంలో చేసిన అమ్మకాలు చెల్లవన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాల జారీకి తిరస్కృతి

బొడ్డపాలెంలో డీపట్టాభూములు కొనుగోలుచేసిన వ్యక్తులు గతంలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేయగా ఆనందపురం తహశీల్దారు తిరస్కరించారు. దాంతో విశాఖ ఆర్డీవో కోర్టులో కేసు దాఖలుచేశారు. డీపట్టా భూముల కొనుగోలు చెల్లదని పేర్కొంటూ ఆర్డీవో సదరు కేసును కొట్టివేశారు. దీనిపై కొనుగోలుదారులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆర్డీవో వద్దే సమస్య పరిష్కరించుకోవాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం భీమిలి ఆర్డీవో వద్ద కేసు పెండింగ్‌లో ఉంది.

విచారణ చేస్తున్నాం

భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆనందపురం మండలం వెల్లంకి రెవెన్యూ పరిధి బొడ్డపాలెంలో సర్వే నంబర్ 292లో భూములను క్లెయిమ్ చేసుకుంటున్న వ్యక్తులకు సంబంధిత డాక్యుమెంట్లు తీసుకుని గురువారం రావాలని సూచించాం. ప్రభుత్వ భూమిలో చొరబడిన వారి వివరాలు సేకరిస్తున్నాము. తప్పుడు ఆధారాలతో ఉ న్న భూమిలో ప్రవేశించిన వ్యక్తులపై కేసు నమోదుచేస్తాం.

# తాగునీరు, డ్రైనేజీలకు రూ.118 కోట్లు

**భయపడొద్దు.. అండగా ఉంటాం**
**బాధితుల పరిస్థితి నిలకడగా ఉంది**
**మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణ**
**డయేరియా వ్యాప్తి ప్రాంతాల్లో పర్యటన**
**మృతుడు సురేష్ కుటుంబానికి భరోసా**
**ఆసుపత్రుల్లో బాధితులకు పరామర్శ**



క్రైం కౌంటర్ న్యూస్ : అరసవల్లి/అర్బన్, ఫిబ్రవరి 25 నగరంలో తాగునీరు, డ్రైనే జీ, మురుగునీటి శుద్ధి కోసం రూ.118 కోట్లు కేటాయిస్తున్నామని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శ్రీకాకుళంలోని దమ్మలవీధి, మొండేటి వీధి, కంట్రవీధి, ఎచ్చెర్ల వీధి తదితర ప్రాంతాల్లో ప్రబలిన డయేరియా అదుపులోకి వచ్చిందని, బాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. బుధ వారం డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మె ల్యే గొండు శంకర్‌తో కలిసి పర్యటించారు. డయేరియాతో మృతి చెందిన మండల సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం డయేరియా బాధితులతో మాట్లాడారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించా రు. వారి పరిస్థితి ఎలా ఉందని వైద్యుల ను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాల యం వద్ద మీడియాతో మాట్లాడారు. 'దురదృష్టవశాత్తు డయేరియాతో ఒకరు మరణించడం చాలా బాధాకరం. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.10లక్షల పరిహారం చెక్కు అందజేశాం. వారికి అన్ని వి?ధాలా అండగా ఉంటాం. నగరంలోని తాగునీటి వ్యవస్థ శాశ్వత పరిష్కారం కోసం రూ.60 కోట్లు కేటాయించాం. డ్రైనేజీ కాలువ ఆధునికీకరణకు రూ.35 కోట్లు, మురుగు నీటి శుద్ధి కోసం రూ.23 కోట్లు కేటాయించాం. దీంతో శ్రీకాకుళంలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య తీర నుంది. ఇప్పటివరకు నగరంలో 102 డయేరియా కేసు లు నమోదు కాగా, అందులో కేవలం రెండు కేసుల్లో బాధితులకు డయాలసిస్ జరుగుతోంది. బుధవారం 13 మంది రోగులు డిశ్చార్జి అయ్యారు. మిగిలిన వారి పరిస్థితి బాగున్నా సరే 24 గంటలు అదనంగా పరిశీ లనలో ఉంచాలని నిర్ణయించాం. వారంతా ఒకటి, రెం డు రోజుల్లో డిశ్చార్జి కానున్నారు. బాధితులకు ప్రభు త్వం తరఫున పూర్తిస్థాయిలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఉచిత వైద్యం అందిస్తున్నాం. ప్రజల ఆరోగ్యం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంనే ఉందని మంత్రి నారాయణ తెలిపా రు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

# అది ప్రణాళికాబద్ధమైన దాడి!

క్రైం కౌంటర్ న్యూస్ : న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠంగా చేర్చడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది జ్యుడీషియరీపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించనని తేల్చిచెప్పారు. న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో పొందుపరచింది. న్యాయవ్యవస్థలో అవినీతి, భారీగా పెండింగ్ కేసులు, న్యాయాధికారులు/న్యాయమూర్తుల కొరతను కూడా అందులో ప్రస్తావించింది. 'మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' పేరుతో ఈ అధ్యాయాన్ని చేర్చింది. గత సంచికల్లో న్యాయవ్యవస్థ, కోర్టుల పాత్ర వరకే పరిమితం కాగా... సోమవారం విడుదల చేసిన నూతన పాఠ్యపుస్తకంలో కోర్టుల వ్యవస్థ, న్యాయం ఎంతవరకు అందుతోంది.. అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో న్యాయవ్యవస్థలో అవినీతి, ఆర్థికంగా బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో దాని ప్రభావం గురించి వివరించారు. ఈ అంశాన్ని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మనుసింఘ్వీ బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్.పంచోలీతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఆ పాఠ్యపుస్తకంలోని సదరు అధ్యాయం అవమానకరంగా ఉందని.. ఆ పుస్తకం ప్రతులు తమ వద్ద ఉ న్నాయని సిబల్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో 8వ తరగతి పిల్లలకు న్యాయవ్యవస్థలో అవినీతిని నేర్పిస్తుండడం చూసి ఈ వ్యవస్థలో సభ్యులుగా ఆందోళన చెందుతున్నామన్నారు.న్యాయవ్యవస్థలో మాత్రమే అవినీతి ఉన్నట్లు పేర్కొన్నారని.. రాజకీయ నాయకులు, మంత్రులు, బ్యూరోక్రాట్లు, ఇతరుల గురించి ఒక్క మాట కూడా లేదని.. ఇది తమను కలవరపరుస్తోందని సింఘ్వీ అన్నారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందించారు. 'ఇది కచ్చితంగా మొత్తం వ్యవస్థను, అందులోని భాగస్వాములను ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్క రోజు ఆగండి. ఇప్పటికే నేను సుమోటోగా ఈ వ్యవహారాన్ని పరిగణనలోకి తీసుకున్నాను. ఆదేశాలు కూడా ఇచ్చాను. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, సమగ్రతను దెబ్బతీయడానికి ఈ భూమ్మీద ఏ ఒక్క వ్యక్తినీ అనుమతించే ప్రసక్తే లేదు. ఏ పరిస్థితుల్లోనూ ఇందుకు అనుమతించను. ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లినా.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. దీనినెలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు' అని సీజేఐ తేల్చిచెప్పారు. ఇది చాలా ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా కనిపిస్తోందన్నారు. ఇంతకు మించి ఏమీ మాట్లాడాలనుకోవడం లేదని చెప్పారు.

# వచ్చామా?.. వెళ్లామా?

**జిల్లాలో మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'**
**- కేవలం ఫొటోలకే పరిమితమవుతున్న అధికారులు**
**- రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వని వైనం**
**- పత్తాలేని వ్యవసాయ అనుబంధ శాఖలు**




**క్రైం కౌంటర్ న్యూస్ :** విజయనగరం ఫిబ్రవరి 25 జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ఏదో వచ్చామా? వెళ్లామా? అన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి మంగళ, బుధ వారాల్లో గ్రామాల్లో ఏదో ఒక పొలంలో బ్యానర్ పెట్టడం.. ఆ సమయంలో అక్కడ ఉన్న రైతులతో ఒక ఫొటో దిగడం.. దాన్ని వారి ముఖ్య కార్యాలయానికి అప్‌లోడ్ చేయడం.. ఆ రోజు కార్యక్రమానికి అయే ఖర్చులను బిల్లులు పెట్టుకోవడం.. ఇదే 'పొలం పిలుస్తోంది' పేరిట నిత్యం జరగుతున్న తంతు. రైతులకు సాగుపై అవగాహన కల్పించడం గానీ, సూచనలు, సలహాలు ఇవ్వడం గానీ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ కార్యక్రమంతో రైతులకు ఒనగూరే ప్రయోజనాలేవీ లేకుండా పోయాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 27 మండలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో 1.41 లక్షల హెక్టార్లలో, రబీలో 80,243 హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగుచేస్తుంటారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, రాగులు, ఉలవలు, పెసర, మినుము, చెరకు, నువ్వులు, కూరగాయలు వంటివి పండిస్తుంటారు. అయితే, ప్రతి సంవత్సరం వాతావరణ ప్రతికూల పరిస్థితులు, చీడపీడలు, తెగుళ్లతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంటుంది. సరైన సాగు సలహాలు లేక ఏటా రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి 2024 సెప్టెంబరు 10న శ్రీకారం చుట్టింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పట్టు పరిశ్రమ, సేంద్రియ, మార్కెటింగ్ శాఖ అధికారులను పొలంబాట పట్టాలని ఆదేశించింది. వీరంతా రైతులతో సమావేశాలు కావాలి. వారికి సరైన సాగు సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఖరీఫ్, రబీలో చెరో నాలుగు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించింది. ప్రతి మంగళ, బుధవారాల్లో విధిగా నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. అయితే, జిల్లాలో ఈ ఏడాదిన్నరలో అధికారులు కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

కానరాని కార్యక్రమాలు..పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాలి. ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పించాలి. ఉద్యానవన పంటల సాగులో మెలకువలు నేర్పించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. మట్టి నమూనాలను సేకరించాలి. అందుకు అనుగుణంగా వినియోగించాల్సిన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. మార్కెటింగ్ కమిటీల ద్వారా ఉత్పత్తులను విక్రయించేందుకు అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పంటల సాగులో పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచేందుకు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఆధునిక సేద్యంపై అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు పంట దిగుబడి తగ్గడాన్ని విశ్లేషించడం, సూక్ష్మపోషణ లోపాన్ని గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం దిశగా ప్రోత్సహించడం చేయాలి. కౌలురైతుల గుర్తింపు కార్డుల జారీ, రైతుమిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం వంటి వాటిపై రైతులను చైతన్యవంతం చేయాల్సి ఉంది. కానీ చాలా మండలాల్లో ఈ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఆదేశాలు బేఖాతరు.. వ్యవసాయరంగానికి అనుబంధంగా ఉన్న సుమారు 14 శాఖల సేవలను వినియోగించుకోవాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది. కానీ, ప్రభుత్వ ఆదేశాలను కొందరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల, నియోజకవర్గస్థాయి అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. వ్యవసాయశాఖ సిబ్బంది తప్ప మిగిలినవారు గ్రామాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు హాజరు కావడంలేదు. ఈ విషయంపై ఏడీఏ మధుసూధనరావుని వివరణ కోరగా 'పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనకపోవడం వాస్తవమే. అందరూ వస్తే రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుంది. మేలైన దిగుబడులు పొందేలా మార్కెటింగ్ చేసుకునేలా చైతన్యం కల్పించవచ్చు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా'.అని తెలిపారు.

# పాలకవర్గ సమావేశం లేక.. నాలుగేళ్లు

**ఇన్‌చార్జి పీవో పాలనతో గాడి తప్పిన ఐటీడీఏ**
**నిధులు మంజూరవుతున్నా.. నిష్ప్రయోజనమే**
**అభివృద్ధి పనులపై కానరాని పర్యవేక్షణ**
**గిరిజన గ్రామాల ప్రజలకు తప్పని ఇబ్బందులు**



**క్రైం కౌంటర్ న్యూస్ :** మెళియాపుట్టి, ఫిబ్రవరి 25 గిరిజనాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు నాలుగేళుగా నిర్వహించడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి. ఈ సమావేశాల్లో ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించాలి. గిరిజన సమస్యలను పరిష్కరించాలి. కాగా వైసీపీ ప్రభుత్వ పాలనలో 2022లో జనవరి 29న అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణి అధ్యక్షతన 77వ పాలకమండలి సమావేశం నిర్వహించారు. అప్పటి నుంచి నాలుగేళు పూర్తయినా.. నేటికీ సమావేశం నిర్వహించకపోవడం గమనార్హం. రెగ్యులర్ పీవో లేకపోవడమే ఇందుకు కారణం. పాలకవర్గ సమావేశాలు నిర్వహించకపోవడంతో అధికారులు సైతం సమస్యలు తెలుసుకునే అవకాశం లేకపోతోంది. ఇన్‌చార్జిలతో కాలం నెట్టుకొస్తుండడంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 మండలాలు ఉండేవి. వైసీపీ హయాంలో జిల్లా పునర్విభజనలో భాగంగా పాలకొండ నియోజకవర్గాన్ని.. కొత్తగా ఏర్పాటు చేసిన పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న సీతంపేట ఐటీడీఏ అటు ఆ జిల్లాకు.. ఇటు శ్రీకాకుళం జిల్లా పరిధిలో కొనసాగుతోంది. ఐటీడీఏ పరిధిలోని 16 మండలాలు శ్రీకాకుళం జిల్లాలో, మరో నాలుగు మండలాలు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నాయి. అప్పట్లో ఐటీడీఏ పీవోగా కల్పనకుమారి ఉండేవారు. ఎన్నికల ముందు బదిలీ అయ్యారు. ప్రస్తుత కూటమి పాలనలో రెగ్యులర్ పీవోలు లేరు. ఇన్‌చార్జి పీవోగా పాలకొండ సబ్‌కలెక్టర్‌గా గతంలో పనిచేసిన యశ్వంత్ కుమార్ పనిచేశారు. ప్రస్తుతం పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఇన్‌చార్జి పీవోగా వ్యవహరిస్తున్నారు. అలాగే సీతంపేట ఐటీడీఏ.. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండడంతో ఏ జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారో తెలియక అధికారుల్లో సైతం గందరగోళం కనిపిస్తోంది. దీంతో పాలనపరమైన ఇబ్బందులు కనిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఐటీడీఏకు వచ్చిన సబ్‌ప్లాన్ నిధులను కార్పొరేషన్లకు మళ్లించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నా.. నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయో.. లేదో పర్యవేక్షించే నాథులు కరువయ్యారు.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 672 గిరిజన గ్రామాల్లో 93,877 మంది గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. కనీస వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. 145 గిరిజన గ్రామాల్లో రహదారులు సక్రమంగా లేవని అధికారులు గుర్తించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.51 కోట్లు నిధులు మంజూరు చేసి.. రహదారి పనులు చేపడుతోంది. కాగా వీటిని పర్యవేక్షించేవారు లేక ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. గురుకులాల బాధ్యత కూడా ఐటీడీఏదే. కాగా చాలా గిరిజన వసతిగృహాల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు గాడి తప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల బందపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు రెండువర్గాలుగా వీడి రచ్చకెక్కారు. దీంతో అక్కడ పనిచేసిన సిబ్బందికి డిప్యుటేషన్‌పై పంపించేశారు. పీవోల పర్యవేక్షణ లేక ఎక్కడా మెనూ సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో ఉన్న సిబ్బందే కొనసాగుతూ.. అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది సిబ్బందిని వెనుకేసుకు వస్తున్నారంటూ ఇద్దరు ఉన్నతాధికారులపై గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఐటీడీఏపై పీవో పూర్తిస్థాయి దృష్టి సారించకపోవడంతో అవకతవకలు జరుగుతున్నాయని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను నియమించాలని, సక్రమంగా పాలన సాగేలా గిరిజనాభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రెగ్యులర్ పీవోను నియమించాలి వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు అన్యాయం జరిగింది. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి.. అభివృద్ధి పనులు చేపడుతోంది. కానీ, పర్యవేక్షణ కొరవడుతోంది. రెగ్యులర్ పీవోను నియమించాలి. మెళియాపుట్టిలో ఏర్పాటు చేయనున్న ఐటీడీఏలో పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బందిని నియమించి.. పాలన సాగిస్తే గిరిజనులకు మేలు జరుగుతుంది.
- బైరిశింగి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి

తప్పుదోవ పట్టిస్తున్నారు వైసీపీ ప్రభుత్వం ఉన్ననాటి నుంచి కొంతమంది సిబ్బంది సీతంపేట ఐటీడీఏను వదలడం లేదు. దీన్నితో ఇన్‌చార్జి పీవోలు వారిపైనే ఆధారపడుతున్నారు. కిందస్థాయిలో జరుగుతున్న విషయాలను తెలుసుకోలేక పోతున్నారు. దీంతో పాలన సక్రమంగా సాగక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

# తాడేపల్లి: అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు పచ్చి అబద్ధాలు



**క్రైమ్ కౌంటర్ న్యూస్....** బుధవారం అసెంబ్లీ సాక్షిగా టీడీపీ అధినేత చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడారని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. పవన్ కళ్యాణ్ను చూసి ఊసరవెల్లి కూడా ఉరేసుకుంటుందని, లోకేష్ పులకేసిని తలపించారని విమర్శించారు. ఈ ముగ్గురూ సొంత డబ్బా కొట్టుకోవడానికే అసెంబ్లీని వేదికగా చేసుకున్నారని దుయ్యబట్టారు. కల్తీ కారణంతోవెనక్కి పంపిన నాలుగు ట్యాంకర్లను తిరిగి ఎందుకు తీసుకున్నారని, వైష్ణవి డెయిరీ సంగం డెయిరీ లోగోతో మజ్జిగ అమ్ముతుందని, వారి మధ్య ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు.....

# డీసీసీబీ ఉద్యోగుల్లో విజిలెన్స్ వణుకు

**ఇప్పటికే రికార్డుల పరిశీలన 8 అవకతవకలు గుర్తింపు**
**తాజాగా 67 మందికి నోటీసులు**
**వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇవ్వాలని సూచన**
**గడువు ముగిసినా కొలిక్కిరాని సెక్షన్ 51 విచారణ**




**క్రైం కౌంటర్ న్యూస్ :** ఒంగోలు, ఫిబ్రవరి 25 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆ సంస్థలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఆ విభాగం అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆ సందర్భంగా గుర్తించిన లోటుపాట్లకు సంబంధించి వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఏకంగా 67 మంది బ్యాంకు ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడంతో కల వరం మొదలైంది. గత వైసీపీ హయాంలో డీసీసీబీలో భారీగా అక్రమా లు, అవకతవకలు చోటుచేసుకున్నాయని ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యా దులు అందిన నేపథ్యంలో వివిధ స్థాయిల్లో విచారణలు జరుగుతున్న విషయం విదితమే. అందులో భాగంగా ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఒంగోలులోని విజిలెన్స్ విభాగం ఏఎస్పీ పర్యవేక్షణలో ఆ శాఖ అధికారులు డీసీసీబీకి చెందిన పలు రికార్డులను పరిశీలించారు. గతంలో అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ విచారణలో గుర్తించిన అంశాలను కూడా విజిలెన్స్ అధికారులు పరిశీలించినట్లు సమాచారం.

రుణాల మంజూరులో భారీగా అక్రమాలు

బ్యాంకుకు చెందిన వివిధ బ్రాంచిల ద్వారా వైసీపీ ప్రభుత్వకాలంలో మంజూరు చేసిన రుణాలలో భారీగా అక్రమాలు జరిగాయని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ప్రధానంగా జగనన్న పాలవెల్లువ, జగనన్న తోడు, ఫిష్ ఆంధ్ర, పొదుపు మహిళా గ్రూపుల రుణాలతోపాటు వ్యవసాయ రుణాలు, ఇతరత్రా ఉన్నట్లు సమాచారం. కోట్లాది రూపాయలకు సంబంధించి రికవరీలు లేకపోవడం కూడా అక్రమాలు జరిగాయన్న అనుమానాలకు ఊతం ఇస్తోంది. ఈనేపథ్యంలో బాధ్యులైన ఉద్యోగులను విచారించాలని విజిలెన్స్ అధికారులు నిర్ణయించుకున్నారు. వివిధ రుణాల మంజూరులో బ్రాంచి మేనేజర్లు, సూపర్‌వైజర్ కీలకం కావడంతో వారిని విచారించేందుకు సిద్ధమయ్యారు. వారందరినీ వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని, సంబంధిత రికార్డులను కూడా వెంట తీసుకురావాలని కోరారు. ఈ మేరకు సదరు ఉద్యోగుల వివరాలతో పీడీసీసీ బ్యాంకు సీఈవోకు విజిలెన్స్ ఒంగోలు ఏఎస్పీ కె.శ్రీనివాసరావు రెండ్రోజుల క్రితం నోటీసు ఇచ్చారు. బ్యాంకు ఉన్నతాధికారులు సదరు ఉద్యోగులకు పంపారు. ఇదిలా ఉండగా సహకార శాఖ పరంగా ప్రభుత్వ ఆదేశాలతో డీసీసీబీపై చేపట్టిన సెక్షన్ 51 విచారణ ఇంకా పూర్తికాలేదు. తొలుత 4 నెలలు సమయం ఇచ్చి, అనంతరం మరో 2 నెలలు పొడిగించారు. ఆ గడువు పూర్తయినప్పటికీ విచారణ మాత్రం కొలిక్కి రాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.







## తిరుమల శ్రీవారి దర్శనంపై వివాదం.

అంజాజీపేట మ్యారేజ్ బ్యాండు సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది శివానీ నగరం. అంతకు ముందు పలు షార్ట్స్ ఫిల్మ్స్ లో నటించిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఆమె నటించిన రెండో సినిమా లిటిల్ హార్ట్స్ సూపర్ హిట్ గా నిలిచింది. ఇందులో శివానీ పోషించిన కాత్యాయని పాత్ర బాగా హైలెట్ అయ్యింది. ఇక లేటెస్ట్ గా హే బలవంత్ అనే సినిమాతో మరోసారి ఆడియెన్స్ ను పలకరించిన ఈ అందాల తార ఇటీవల అనుకోకుండా ఓ వివాదంలో చిక్కుకుంది. తిరుమలలో తనకు 15 నిమిషాల పాటు శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారని ఓ ఇంటర్వ్యూలో శివానీ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. దీనిపై సామాన్య భక్తుల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. దీంతో ఈ వివాదంపై క్లారిటీ ఇస్తూ మరో వీడియోను రిలీజ్ చేసింది శివాని.కొన్నిరోజుల క్రితం ఓ యూట్యూబ్ ఛానెల్‌కి నేను ఇంటర్వ్యూ ఇచ్చాను. నా చైల్డ్ హుడ్ జర్నీ, సినిమా కెరీర్ తో పాటు భక్తి, ఆధ్యాత్మికతకు సంబంధించి చాలా విషయాలు అందులో మాట్లాడాను. అందులో భాగంగానే కేదార్నాథ్, రామకోటి రాయడం, షిరిడి, తిరుమల తిరుపతి శ్రీవారి ఆలయాల గురించి మాట్లాడాను. కానీ అందులో కేవలంనేను తిరుమలలో 15 నిముషాలు దర్శనం తీసుకున్నాను అని చెప్పింది మాత్రమే హైలెట్ అవుతుంది. దానికి క్లారిటీ ఇవ్వడానికి నేను ఈ వీడియో చేస్తున్నా. 2025 అక్టోబర్ లో 10,500 రూపాయలు కట్టి శ్రీవాణి దర్శనం టికెట్స్ నేను మా అమ్మ లైన్లో నిల్చొని తీసుకున్నాం. ఆ తర్వాత శ్రీవారి దర్శనం చేసుకున్నాం. తిరుమల ఆలయంలో క్యూ లైన్‌లో మొదటి నుంచి స్వామి దగ్గరకు వెళ్లేంత వరకు కొంచెం కొంచెం స్వామి వారు కనిపిస్తుంటారు. నేను ఆ సమయం ఆ మొత్తం 15 నిమిషాలు ఉంటుందని అంచనాతో అలా చెప్పాను. అంతే కానీ 15 నిముషాలు నన్ను ఎవరూ టచ్ చేయలేదు అని కాదు'నేను చాలా సార్లు రూ.300 టికెట్ తీసుకుని కుటుంబంతో కలిసి తిరుమల వెళతాను. అప్పుడు కేవలం 5 సెకన్ల పాటు స్వామిని చూస్తాను. నా జీవితంలో తొలిసారి 13 ఏళ్ల తర్వాత స్వామిని అంత సమీపం నుంచి చూశాను. ఇది నేను ఎంతో సంతోషంగా భావించి ఆత్రుతతో ఆ విషయాన్ని పంచుకున్నాను అంతే. అయితే అది కొంచెం మిస్ లీడింగ్‌గా వెళ్తోంది. నాకే కాదు మీలో ఎవరైనా సరే శ్రీవాణి దర్శనం టికెట్ తీసుకొని వెళ్తే కచ్చితంగా స్వామివారి దర్శనం దగ్గరగా, చాలా మంచిగా జరుగుతుంది. నాలాగే మీరు కూడా మంచి అనుభూతి చెందుతారు. దీనిపై క్లారిటీ ఇవ్వాలి అనేది నా బాధ్యత. ఇది నా టికెట్' అంటూ తన శ్రీవాణి దర్శనం టికెట్ కూడా చూపించింది శివాని. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది.





## షుగర్ ఉన్నవారు మామిడిపండు తింటే ఏమవుతుంది..?

మామిడి సీజన్ వచ్చిందంటే చాలు.. ఆ మధుర ఫలాలను చూసి నోరు ఊరని వారుండరు. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు మాత్రం అబ్బే మామిడి తింటే షుగర్ లెవల్స్ పెరిగిపోతాయి అనే భయంతో ఆ అమృతాన్ని దూరం పెడుతుంటారు. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇప్పుడు ఒక తీపి కబురు అందింది. మామిడి పండ్లు తినడం వల్ల షుగర్ పెరగడం పక్కన పెడితే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని తాజా పరిశోధనలు చెబుతున్నాయి.నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. టైప్-2 డయాబెటిస్ ఉన్నవారు సరైన పద్ధతిలో మామిడి తింటే అది వారి ఆరోగ్యానికి మేలు చేస్తుందని తేలింది.ఏమిటా పరిశోధన?

సుమారు ఎనిమిది వారాల పాటు నిర్వహించిన ఈ అధ్యయనంలో పరిశోధకులు కొన్ని ఆసక్తికరమైన అంశాలను గుర్తించారు. రోజువారీ అల్పాహారంలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారానికి బదులుగా మామిడిని తీసుకున్న వారిలో చక్కెర స్థాయిలు పెరగకపోగా, నియంత్రణలో ఉన్నట్లు గమనించారు. మామిడి తినడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెరిగి గుండె ఆరోగ్యం మెరుగుపడిందని తేలింది. సరైన పరిమాణంలో తీసుకున్నప్పుడు ఇది బరువు పెరగకుండా చేయడంలో కూడా సహాయపడింది.

ఎలా తింటే సురక్షితం?

మామిడి పండు తింటే షుగర్ పెరుగుతుందా లేదా అనేది మీరు ఎంత తింటున్నారు, ఎలా తింటున్నారు..? అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

రోజుకు 250 గ్రాముల కంటే ఎక్కువ మామిడి పండును తీసుకోకూడదు.

మామిడి తిన్న రోజున, మీరు తీసుకునే ఇతర కార్బోహైడ్రేట్లు, స్టార్చ్ ఉన్న ఆహారాన్ని తగ్గించాలి.


బిర్యానీలు లేదా స్వీట్లు తిన్న తర్వాత మామిడి పండు తింటే మాత్రం షుగర్ లెవల్స్ అకస్మాత్తుగా పెరిగే ప్రమాదం ఉంది.

మామిడిలో దాగున్న పోషక విలువలు

మామిడి కేవలం రుచికి మాత్రమే కాదు, ఇది పోషకాల గని కూడా..

ఖనిజాలు: పొటాషియం, ఐరన్ లభిస్తాయి.

యాంటీఆక్సిడెంట్లు: శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీఆక్సిడెంట్లు ఇందులో మెండుగా ఉన్నాయి.



## ఈ ఆకులు ఉండగా..

ప్రస్తుతం రోజుల్లో అందరూ ఎవరు పనుల్లో వారు చాలా బిజీగా ఉన్నారు. కొందరికి పని ఒత్తిడి వలన ఫుడ్ సరిగా తినరు. దీని వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. వాటిలో అందరూ ఎదుర్కొంటున్న సమస్య జీర్ణక్రియ పనితీరు మందగించడం. పనిలో పడి ఇంట్లో చేసుకుని తినే సమయం లేక బయట లభించే ఫాస్ట్ ఫుడ్స్ , ఆయిల్ ఫుడ్స్, మొబైల్ ఎక్కువగా వాడటం ఇలాంటి అలవాట్ల వలన జీర్ణవ్యవస్థ పాడయ్యే అవకాశం ఉంది. ఇవి మాత్రమే కాకుండా గ్యాస్, కడుపు నొప్పి, నిద్ర లేమి వంటి సమస్యలు ఈ రోజుల్లో చాలా కామన్ అయిపోయింది.జీర్ణవ్యవస్థ

బయట ఫుడ్స్ తినడం వలన కొందరికి విపరీతమైన కడుపునొప్పి వస్తుంది. ఇది ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. తిన్న ఫుడ్స్ జీర్ణం కాకపోతే శరీరానికి తగిన పోషకాలు సరిగా అందకుండా పోతాయి. దాని వలన ఇతర సమస్యలు కూడా వస్తాయి. ఇంకా నీరసం, వాంతులు వంటి సమస్యలు కూడా వస్తాయి. దీని కోసం మీరు హాస్పిటల్??కి వెళ్లాల్సిన అవసరం లేదు. మన ఇంటి దగ్గర దొరికే తమలపాకును తింటే చాలు. ఈ సమస్యలకు చెక్ పెట్టొచ్చు.

తమలపాకు జ్యూస్ రూపంలో కానీ నమలడం వలన కానీ జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. నిజం చెప్పాలంటే ఇది మంచి మెడిసిన్. తమలపాకును నోటిలోవేసుకున్నప్పుడు లాలాజలం వస్తుంది. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయం చేస్తుంది. ఇప్పటికి ఊర్లలో ఈ ఆకులు కనిపిస్తే చాలు నోట్లో వేసుకుని నములుతూనే ఉంటారు.ఎందుకంటే, దీనిలో సహజ సుగంధ ద్రవ్యాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎంతటి నొప్పిని అయినా ఇట్టే తగ్గిస్తాయి. ఇంకా ఇవి వాత సమస్యలకు కూడా చెక్ పెడుతుంది. కాబట్టి, వీటిని ఇప్పటి నుంచి తినడం అలవాటు చేసుకోండి. మొదట్లో చేదుగా ఉన్నా తినగా తినగా మంచి టేస్ట్ వస్తుంది.

## రీఎంట్రీకి సిద్ధమైన డేంజరస్ ప్లేయర్?

భారత స్టార్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ తన తండ్రి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి టీమిండియా క్యాంప్‌ను విడిచి ఇంటికి వెళ్లిపోయాడు. అయితే టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 దశలో జింబాబ్వేతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు రింకు తిరిగి జట్టుతో చేరనున్నట్లు భారత బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ బుధవారం స్పష్టం చేశారు.చెన్నైలో ఉన్న భారత జట్టు క్యాంప్‌ను వదిలి రింకు సింగ్ మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్లాడు. తన తండ్రి అనారోగ్యం తీవ్రంగా ఉ ండటంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సితాంశు కోటక్, రింకు బుధవారం సాయంత్రానికే తిరిగి జట్టులో చేరనున్నాడని వెల్లడించారు. గురువారం జరిగే జింబాబ్వే మ్యాచ్‌కు ముందు అతను అందుబాటులో ఉంటాడని తెలిపారు.

రింకు సింగ్ తండ్రి స్టేజ్-4 లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ ప్రస్తుతం వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారు. ఈ కారణంగానే రింకు అత్యవసరంగా ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ప్రీ-మ్యాచ్ మీడియా సమావేశంలో కోచ్ కోటక్ మాట్లాడుతూ, "రింకు తండ్రికి ఆరోగ్యం బాగోలేదు. అందుకే అతను ఇంటికి వెళ్లాడు. కానీ ఈరోజు సాయంత్రం తిరిగి జట్టుతో చేరతాడని అనుకుంటున్నాను," అని చెప్పారు.

ఇక మరోవైపు, సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఘోర పరాజయం తర్వాత టీమిండియా తీవ్ర ఒత్తిడిలో ఉంది. టాప్ ఆర్డర్ వైఫల్యం, నెట్ రన్ రేట్ (-3.80) భారీగా పడిపోవడం వల్ల జింబాబ్వేతో జరిగే సూపర్-8 రెండో మ్యాచ్‌లో భారీ తేడాతో గెలవడం భారత్‌కు చాలా కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించకపోతే సెమీఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఉంది.

ఈ వరల్డ్ కప్‌కు ముందు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మల అద్భుతమైన ప్రారంభాలతో భారత్ హోం సిరీస్‌లలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లపై ఆధిపత్యం చెలాయించింది. కానీ ప్రస్తుతం అభిషేక్ శర్మ కడుపు ఇన్ఫెక్షన్‌తో బాధపడడంతో అతని ఫామ్ తగ్గినట్లు కనిపిస్తోంది.



## 3 మార్పులతో బరిలోకి భారత జట్టు..

సెమీ ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే జింబాబ్వేపై భారీ విజయం టీం ఇండియాకు అనివార్యం. ఈ కీలక మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చోటు చేసుకోనున్నాయి. తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉ ంది. రింకు వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లడంతో సందిగ్ధత నెలకొంది.టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీం ఇండియా ప్రస్థానం ఉత్కంఠగా మారింది. ప్రతి మ్యాచ్ చావో రేవో అన్నట్లుగా మారడంతో జట్టు సెమీ ఫైనల్ చేరాలంటే కేవలం గెలుపుతో పాటు అదృష్టం కూడా తోడవ్వాలి. ముఖ్యంగా దక్షిణాఫ్రికా చేతులో ఎదురైన 76 పరుగుల ఘోర పరాజయం భారత్ నెట్ రన్ రేట్‌ను మైనస్‌లోకి నెట్టేసింది. ఈ పరిస్థితుల్లో భారత జట్టుకు గండం గట్టెక్కాలంటే జింబాబ్వేపై సాధారణ విజయం సరిపోదు. ఒక భారీ విధ్వంసం సృష్టించి, జింబాబ్వేను చిత్తుగా ఓడించి రన్ రేట్‌ను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే వెస్ట్ ఇండీస్‌తో జరిగే చివరి పోరులో కూడా భారత్‌కు అవకాశం ఉంటుంది.ఈ కీలకమైన డూ ఆర్ డై మ్యాచ్ గురువారం, 26వ తేదీన చెన్నైలోని వేదికగా జింబాబ్వేతో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం టీం ఇండియా తుది జట్టులో మూడు కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మార్పులు జట్టు బలాన్ని పెంచి, విజయావకాశాలను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు.

మొదటి మార్పుగా, ఫామ్ లేమితో గత కొంతకాలంగా సతమతమవుతున్న తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంజు శాంసన్ బ్యాటింగ్‌లో స్థిరత్వాన్ని, దూకుడును తీసుకురాగలడని భావిస్తున్నారు. రెండవ మార్పుగా, వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులో చేరవచ్చు. అక్షర్ పటేల్ తన స్పిన్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ కీలక పరుగులు చేయగలడు.మూడవ, అత్యంత కీలకమైన మార్పు రింకు సింగ్‌కు సంబంధించింది. రింకు సింగ్ కుటుంబ అత్యవసర పరిస్థితుల కారణంగా హుటాహుటిన జట్టును వీడి ఇంటికి వెళ్ళిపోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తండ్రి అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితులు విషమంగా ఉండటంతో అతడు వెంటనే వెళ్ళాల్సి వచ్చిందని సమాచారం. దీంతో గురువారం జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌కు రింకు సింగ్ అందుబాటులో ఉంటాడా లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఫినిషర్‌గా మెరుపులు మెరిపించాల్సిన రింకు ఈ ప్రపంచ కప్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా అతడిని జింబాబ్వేతో మ్యాచ్‌లో ఆడించే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు, మ్యాచ్ జరిగే చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో రింకు స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉ న్నాయి.మొత్తంగా, తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవులతో కూడిన ఈ మూడు మార్పులు జింబాబ్వేతో జరిగే ఈ డూ ఆర్ డై మ్యాచ్‌లో టీం ఇండియాకు కీలకం కానున్నాయి. ఈ మార్పులతో భారత జట్టు సెమీ ఫైనల్ రేసులో నిలబడటానికి పటిష్టంగా సిద్ధమవుతోంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com